క్లుప్తంగా

గట్టు ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోండి



అరికెరలో గ్రామస్తులకు సూచనలు చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

ఆలూరు రూరల్: దేవరగట్టు బన్ని ఉత్సవాలను సాంప్రదాయబద్ధంగా ప్రశాంతంగా నిర్వహించుకోవాలని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసులు సూచించారు. ఆయన మంగళవారం సాయంత్రం ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు, సెబ్ సీఐ ఎర్రవెంకట్ ఆధ్వర్యంలో అరికెర గ్రామంలో బన్ని ఉత్సవాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. రింగు కర్రలు తీసుకుని, మద్యం సేవించి గట్టు ఉత్సవాల్లో పాల్గొనరాదన్నారు. దసరా ఉత్సవాలను కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. సర్పంచ్ నాగరాజు, ఎస్ఐలు శ్రీనివాసులు, నాగేంద్ర పోలీసు సిబ్బంది ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఎమ్మిగనూరుటౌన్: పీలేరులో బుధవారం నుంచి 20వ తేదీ వరకు జరుగనున్న 6వ రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు పట్టణంలోని ఎంఎస్ బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. పాఠశాల విద్యార్థినులు గీతమ్మ, నందిని, మేఘన, ఇందు, మౌనిక, రేణుక, చాముండేశ్వరి, అక్షిత రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో వారిని పాఠశాల హెచ్ఎం కృష్ణమూర్తి మంగళవారం అభినందించారు. వారికి శిక్షణ ఇచ్చిన పీడీలు సుజన కుమారి, నాగేశ్వరిలను అభినందించిన ఆయన రాష్ట్రస్థాయి పోటీల్లోనూ రాణించాలని ప్రోత్సహించారు.

తుగ్గలి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని జి.మానస రాష్ట్రస్థాయి లాంగ్‌జంప్ పోటీలకు ఎంపికైనట్లు మంగళవారం వ్యాయామ ఉపాధ్యాయుడు సంధ్యానాయక్ తెలిపారు. ఈనెల 12న జిల్లా స్థాయిలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ లాంగ్‌జంప్ పోటీల్లో మానస ప్రతిభ కనబర్చి మొదటి స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైందన్నారు. పోటీలకు ఎంపిక వడం పట్ల హెచ్ఎం జయలక్ష్మి, ఉపాధ్యాయులు మానసను అభినందించారు.

మిరప పైర్ల పరిశీలన



ఏరూరు గ్రామంలో మిరప పైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

చిప్పగిరి: మండలంలోని ఏరూరు, దేగులహాలు గ్రామాల్లో మిరప పైర్లను ఎమ్మిగనూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మిరప పంటలో తెగుళ్ల నివారణ, అధిక దిగుబడులు సాధించేందుకు అనుసరించాల్సిన పద్ధతులు, పిచికారీ మందుల వాడకం, భూసారం పెంచడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఎంటోమలజీ సైంటిస్ట్ డాక్టర్ రమేష్ నాయక్, హార్టికల్చర్ ఆఫీసర్ ఇందిర, అగ్రికల్చర్ అసిస్టెంట్ సుబ్బరాయుడు, రైతులు పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

ఆలూరు రూరల్: ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకు దేవరగట్టులో నిర్వహించే బన్ని ఉత్సవాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆలూరు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాగేంద్ర తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ముగ్గురు ఏఈల సమక్షంలో విద్యుత్ లైన్, ట్రాన్స్‌ఫార్మర్లు చెక్ చేస్తున్నట్లు చెప్పారు. బన్ని ఉత్సవాల రోజు ఆలూరు, నెరణికి, విరుపాపురం ఫీడర్ల నుంచి విద్యుత్ అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 200 కేవీ సామర్థ్యం గల తాత్కాలిక ట్రాన్స్‌ఫార్మర్ అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎనలేనివి

కృష్ణగిరి: గ్రామాలను శుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు అమోఘమని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని చుంచుఎర్రగుడి గ్రామంలో వైఎస్సార్‌సీపీ యూత్ కన్వీనర్ లక్ష్మికాంత రెడ్డి పారిశుద్ధ్య కార్మికులు, జర్నలిస్టులు, వలంటీర్లు, గ్రామసేవకులు, పార్టీ కార్యకర్తలకు దసరా కానుకగా అందిస్తున్న దుస్తులను మంగళవారం ఆయన పంపిణీ చేశారు. నాయకులు వెంకటేశ్వరరెడ్డి, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు పెరవలికి ఎమ్మెల్యే రాక

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామానికి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి 18వ తేదీ బుధవారం సాయంత్రం 4 గంటలకు వస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి, మండల కన్వీనర్ గంపల వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. జగనన్న కాలనీలో రూ.50 లక్షలతో నిర్మించే ఓవర్‌హెడ్ ట్యాంక్, ఇంటింటికీ కొళాయి పథకాలకు భూమి పూజ చేయడం జరుగుతుందన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సంక్షేమ పరవళ్లు



గ్రామ స్వరాజ్యానికి నాంది.. గ్రామ సచివాలయం

- ఈనెల 19న ఎమ్మిగనూరుకు సీఎం రాక
- జననేత పాలనలో జనం మేలుకు పెద్దపీట
- వ్యవసాయానికి ఊతం.. చేనేతకు చేయూత

ఎమ్మిగనూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాలుగున్నరేళ్ల పాలన జనామోదయోగ్యమైంది. ఇచ్చిన హామీలు–ఎన్నికల మేనిఫెస్టోను భగవద్గీతగా భావించి జన సంక్షేమానికి క్యాలెండర్ రూపొందించడం దేశ చరిత్రలో నూతన అధ్యాయం. కరోనా కష్టాలు వెన్నాడినా.. గత పాలకుల పాపాలు అడ్డంకులుగా ఉన్నా.. విభజనాంధ్రాను లోటుబడ్జెట్ వెక్కిరిస్తున్నా.. వ్యవస్థలను మేనేజ్ చేసే కుటిల రాజకీయ కుట్రలను సైతం చిరునవ్వుతో స్వీకరిస్తూ అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా పాలనను కొనసాగించడం జననేతకే సాధ్యమేమో అన్నట్లు ముందడుగు వేస్తూ నాలుగన్నరేళ్ల దాటడం అభినందనీయం.

వ్యవసాయానికి పెద్దపీట వేస్తూ.. పేదలకు 'పట్ట'ం కడుతూ.. విద్యారంగంలో వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టి.. మెరుగైన వైద్య సేవలకు బాటలు వేస్తూ నిత్యం పేదల పక్షాన నిలవడం, వారి గురించే ఆలోచించడం జననేత పాలనలో కీలకమయ్యాయి. చేనేతకు చేయూతనిస్తూ.. జీవనోపాధి మార్గాలను పెంపొందిస్తూ ప్రతి ఇంటా సంక్షేమ గంట మోగిస్తూ.. అభివృద్ధే అజెండాగా ముందుకుసాగుతున్న జగనన్న పాలన మరో పాతికేళ్లైనా కొనసాగాలని కోరుకునే జనం ఆశలు.. ఆకాంక్షలు మరింత ప్రబలమయ్యాయి. 'జగనన్న చేదోడు' కార్యక్రమంతో లబ్ధిదారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గురువారం ఎమ్మిగనూరుకు రానున్న సందర్భంగా జననేత పాలనలో ఎమ్మిగనూరు ప్రజలకు జరిగిన మేళ్లలో మచ్చుకు కొన్నింటిని పరిశీలిస్తే..

వ్యవసాయానికి వెన్నముక

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచే వ్యవసాయ రంగానికి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెద్దపీట వేశారు. పంట సాగుకు అవసరమైన పెట్టుబడుల కోసం నియోజకవర్గంలో రైతు భరోసా కింద 15,325 మంది రైతులకు యేటేటా ఆర్థిక సహాయం అందిస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల నిర్మాణంతో ప్రతి రైతుకు గ్రామస్థాయిలో సబ్సిడీ విత్తనాలు మొదలు ఎరువులు, సస్యరక్షణ సలహాలు, పంట దిగుబడుల కొనుగోళ్లు చేపడుతున్నారు. 54 రైతు భరోసా కేంద్రాలకు నూతన భవనాల నిర్మాణం చేపట్టారు. పంట బీమా ప్రీమియంను ప్రభుత్వమే చెల్లించి ఎమ్మిగనూరు నియోజకవర్గంలో పంట నష్టపోయిన 13,963 మంది రైతులకు రూ.32.30 కోట్ల బీమా సొమ్ము అందించారు.

చేనేతకు చేయూత

పాదయాత్ర ద్వారా అణగారిన చేనేత బతుకులను కళ్లారా చూసిన వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక వారికి చేయూత నిచ్చేందుకు సంకల్పించారు. చేనేత కార్మికుల కోసం నాలుగేళ్లుగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని మేలు ఇప్పుడు చేస్తున్నారు. బడ్జెట్‌లో చేనేతల కోసం ప్రత్యేకంగా రూ.200 కోట్లు కేటాయించి సంక్షేమాన్ని ముందుకు నడిపిస్తున్నారు. నేతన్న నేస్తం ద్వారా అర్హులైన చేనేత కుటుంబాలకు యేటా రూ.24 వేలు చొప్పున వారి ఖాతాలోనే జమచేస్తుండటంతో నేతన్నల జీవితాల్లో భరోసా ఏర్పడింది. నియోజకవర్గంలో 1988 చేనేత కార్మికులకు నేతన్న నేస్తం ద్వారా యేటా రూ.4.77 కోట్లు చొప్పున ఐదు విడతల్లో రూ.23.85 కోట్లు అందించారు. చేనేత కార్మికులకు 50 ఏళ్లకే ఫించన్ ఇస్తూ ఆదుకుంటున్నారు. 1449 మందికి ప్రతినెలా రూ.39.84 లక్షలు పెన్షన్ల రూపంలో ప్రభుత్వం అందిస్తోంది. చేనేత క్లస్టర్ల ద్వారా ముడిసరుకులు, అధునాతన యంత్ర సామగ్రి అందిస్తున్నారు.

పేదలకు 'పట్టా'భిషేకం

నిరుపేదల సొంతింటి కల సాకారం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న ఇంటి పట్టాల పంపిణీని పండుగలా చేపట్టారు. నియోజకవర్గంలో 8,521 ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. కోర్టు కేసులతో మరో 2500 పట్టాల పంపిణీ నిలిచిపోయింది. ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో 7,382 ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. ఇళ్ల నిర్మాణానికి ఇప్పటికూ రూ.45 కోట్లు ఖర్చుచేశారు. ఎమ్మిగనూరులో 2300 మందికి టిడ్కో ఇళ్ల హక్కు పత్రాల పంపిణీ జరిగింది. మధ్య ఆదాయ వర్గాల కోసం నవోదయ స్కూల్ ఎదురుగా జగనన్న స్మార్ట్‌టౌన్‌షిప్‌తో మరో 1106 మందికి సొంతింటి కల సాకారం చేయనున్నారు.

ఉద్యోగాల విప్లవం: సీఎం వైఎస్ జగన్ పాలనలో నిరుద్యోగ యువతకు ఉపాధి–ఉద్యోగ అవకాశాలు మెరుగుపడ్డాయి. ఆయన ఆలోచనల్లో పుట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా ఉద్యోగాల విప్లవం వచ్చింది. నియోజకవర్గంలో 91 సచివాలయాలు ఏర్పాటు చేసి అందులో 753 మందికి ఉద్యోగాలు కల్పించారు. అంతేకాకుండా వారిని రెగ్యులరైజ్ చేయడం, బదిలీ అవకాశాలు కల్పించడం విశేషం. అదేవిధంగా నియోజకవర్గంలో 1,325 మంది వలంటీర్లను నియమించారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ నుంచి శిక్షణ ఇచ్చి 2500 మందికి ప్రవేట్ సంస్థలో ఉద్యోగాలు పొందేలా చేశారు. అదేవిధంగా 98 డీఎస్సీ ద్వారా ఎంపికైన వారికి ఉపాధ్యాయులుగా నియమించారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.18,500కు పెంచడం, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, పొదుపు సంఘాల బుక్‌కీపర్లకు వేతనాలు పెంచడం విశేషం.ఇటీవల కాంట్రాక్టు లెక్చరర్లుకు జీతాలు పెంచి భరోసా కల్పించారు.



ఎమ్మిగనూరులో అర్బన్ హెల్త్ సెంటర్ నూతన భవనం

నియోజకవర్గానికొక స్కిల్ హబ్ ఏర్పాటు చేసి యువత నైపుణ్యాన్ని మెరుగుపర్చి స్వయం ఉపాధి అవకాశాలు పెంపొందిస్తున్నారు. రూ.430 కోట్లతో తుంగభద్ర దిగువ కాలువ ఆధునీకరణ చేపట్టారు. గతేడాది రూ.230 కోట్ల పనులు జరిగాయి. ఈ యేడాది మిగతా పనులు ప్రారంభమయ్యాయి. రూ.57.37 కోట్లతో గాజులదిన్నె ప్రాజెక్టు బండ్(ఆనకట్ట)ను 1 మీటరు ఎత్తు పెంచి ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం పెంచే పనులు పూర్తయ్యాయి. అదేవిధంగా హంద్రీ–నీవా నుంచి 3 టీఎంసీల నీటిని గాజులదిన్నె ప్రాజెక్టుకు మళ్లించే పనులు జరిగాయి. నాడూ–నేడు ద్వారా రూ.206 కోట్లతో 176 పాఠశాలల ఆధునికీకరణ చేపట్టారు. 62 సచివాలయాలు, 54 రైతు భరోసా కేంద్రాలు, 50 హెల్త్ క్లీనిక్‌లు, 25 పాలశీతలీకరణ కేంద్రాల నిర్మాణాలు జరుగుతున్నాయి. నియోజకవర్గంలో రూ.25 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణం, రూ.42 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులు జరిగాయి.



గాజులదిన్నె ప్రాజెక్టుకు ఆధునిక హంగులు

అభివృద్ధి పనులకు ఆయువు

సంక్షేమ ఫలాలతోపాటు అభివృద్ధి పనులకు ఆయువు పోశారు. రూ.12.60 కోట్లతో ప్రభుత్వ ఆసుపత్రిని ఆధునీకరించి 100 పడకలకు అప్‌గ్రేడ్ చేయడంతో పాటు వైద్యుల పోస్టులు పెంచి సేవలు విస్తృతమయ్యేలా చేశారు. పట్టణంలో నాలుగు అర్బన్ హెల్త్ సెంటర్లకు రూ.2.4 కోట్లతో కొత్త భవనాలను నిర్మించారు. మున్సిపాలిటీ పరిధిలో నాలుగేళ్లలో రూ.13.87 కోట్లతో డ్రైన్లు, రోడ్లు నిర్మించారు. పట్టణ ప్రజలకు శాశ్వత తాగునీటి కోసం గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి నీటి సరఫరా కోసం ఏఐఐబీ పథకం ద్వారా రూ.144 కోట్లతో చేపడుతున్న నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మాజీ సీఎం చంద్రబాబు హయంలో నిలిచిపోయిన నాగలదిన్నె బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేశారు. రూ.6 కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లించడం, తెలంగాణవైపు భూసేకరణ సమస్యను పరిష్కరించడంతో బ్రిడ్జినిర్మాణం పూర్తయ్యింది.



నిర్మాణం పూర్తయిన నాగలదిన్నె బ్రిడ్జి

జగనన్న ఇచ్చిన వరం



మాలాంటి నిరుపేదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన వరంతో జగనన్న కాలనీలో మాకు సొంతింటి కల తీరింది. ఉండటానికే దిక్కులేని మాకు బళ్లారి–రాయచూరు హైవే రోడ్డు పక్కనే జగనన్న కాలనీ ఏర్పాటు చేసి ఇళ్లు నిర్మించడం మా అదృష్టం. సొంతింటి కల తీరింది. గృహప్రవేశం చేసి ఆనందంగా జీవిస్తున్నాం.

– ఏ జయమ్మ, బోదబండ, ఎమ్మిగనూరు మండలం

నాలుగేళ్లలో రూ.96 వేల సాయం



మగ్గం బతుకులు జీవించడం కష్టమైన సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేనేతలకు దేవుడయ్యాడు. నేతన్న నేస్తం ద్వారా ఏటా రూ.24 వేలు చొప్పున సాయం అందిస్తున్నారు. కరోనా కష్టకాలంలో జగనన్న సాయం లేకుంటే మా బతుకులు దుర్భరమయ్యేవి. ఇప్పుడు మేము చేనేత కార్మికులం అని గర్వంగా చెప్పుకొనే పరిస్థితిని జగనన్న కల్పించారు.

– టి.లక్ష్మి,నాగలదిన్నె

సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన



సభా వేదికను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కో–ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, బీవై రామయ్య

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో 19వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభ నిర్వహించి జగనన్న చేదోడు నాలుగవ విడత నిధులు మంజూరు చేయనున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. స్థానిక వైడబ్ల్యూసీఎస్ మైదానంలో నిర్వహించే సభా వేదిక, హెలీప్యాడ్ పనులను మంగళవారం వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, కర్నూలు జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పరిశీలించారు. ఏర్పాట్లలో ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కూర్చునేందుకు కుర్చీలు, సభా వేదిక, ఇతర ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలిచ్చారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి వెంట ఉన్నారు.

జాబ్‌మేళాలో 48 మందికి ఉద్యోగాలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్, గవర్నమెంట్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో నిర్వహించిన మినీ జాబ్‌మేళాలో 48 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మహబూబ్‌బాష పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జాబ్‌మేళాలో 111 మంది విద్యార్థులు పాల్గొనగా 37 మంది బిగ్‌బాస్కెట్ కంపెనీకి ఎంపిక కాగా నవభారత్ కంపెనీకి నలుగురు, షింప్రియాన్ కంపెనీకి ముగ్గురు, ఫ్యూజియాన్ కంపెనీకి నలుగురు ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. జేకేసీ ప్రతినిధి న్యూటన్‌రాజు, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ సుశీలమ్మ, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ సుధాకర్ బాబు, సూపరింటెండెంట్ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనను జయప్రదం చేద్దాం



మాట్లాడుతున్న కప్పట్రాళ్ల మల్లికార్జున, జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ

దేవనకొండ: ఈనెల 19వ తేదీన ఎమ్మిగనూరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్వహించనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున, జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ అన్నారు. ఈ మేరకు మంగళవారం వారు స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం వరుసగా నాలుగోసారి జగనన్న చేదోడు నిధులు విడుదల చేయడం సీఎం జగనన్నకే చెల్లిందన్నారు. అలాగే ఎన్నో ఏళ్లుగా కులగణనపై ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసినా ఎవరూ పట్టించుకోలేదని, ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందుకు చర్యలు తీసుకోవడం హర్షణీయమన్నారు. సీఎం సభను విజయవతం చేయడంపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, కో–ఆప్షన్ మెంబర్ జుబేర్ సాబ్, శంకరయ్య, హరిశ్చంద్రులు పాల్గొన్నారు.

20న దస్తగిరి కట్ట ప్రారంభోత్సవం

మద్దికెర: మండల పరిధిలోని హంప గ్రామంలో ఈ నెల 20వ తేదీన హజరత్ దస్తగిరయ్య స్వామి కట్ట ప్రారంభోత్సవం చేయనున్నట్లు గ్రామస్తులు మంగళవారం తెలిపారు. నూతనంగా నిర్మించిన స్వామి వారి కట్ట ప్రారంభంతో పాటు గ్రామ పురవీధుల గుండా షంషీర్ ఊరేగింపు ఉంటుందన్నారు. మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమం ఉంటుదని భక్తులు విరివిగా పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలన్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా సౌకర్యాలు

ఆలూరు: హొళగుంద మండలం దేవరగట్టులో కొలువుదీరిన మాళ మల్లేశ్వర స్వామి ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ.. భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, పారిశుద్ధ్యం, వైద్య శిబిరాలు, వాహనాల పార్కింగ్, అధికారుల వసతి తదితర సదుపాయాలు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకున్నామన్నారు. ఈనెల 19వ నుంచి 28వ తేదీ వరకు అర్చకులు, నిర్వాహకులు, గ్రామస్తులు, కమిటీ పెద్దల సహకారంతో ఉత్సవాలు నిర్వహించనున్నామని, ఆయా గ్రామాల ప్రజలు సహకారం అందించాలని కోరారు.

పండ్ల తోటల సాగుపై దృష్టి పెట్టాలి

కృష్ణగిరి: అర్హులైన రైతులందరూ పండ్ల తోటల సాగుకు ముందుకు వచ్చేలా వారిలో చైతన్యం తీసుకురావాలని ఎంపీడీఓ విశ్వమోహన్ ఆదేశించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కోయిలకొండ గ్రామంలో సాగు చేసిన పండ్ల మొక్కలను మంగళవారం ఆయన ఏపీఓ శ్రీనివాసులుతో కలిసి పరిశీలించారు. నాటిన ప్రతి మొక్కను బతికించుకుంటే నాలుగేళ్లలో రైతుకు ఆదాయ వనరుగా మారుతుందన్నారు. రైతులు మొక్కలను కాపాడుకోవాలని మూడేళ్లపాటు వాటి సంరక్షణకు నిధులు ఇస్తామన్నారు. వీరి వెంట సీనియర్ మేటీ సురేంద్ర ఉన్నారు.

విషజ్వరాల నివారణపై అవగాహన

ఆలూరు రూరల్: మొలగవల్లి గ్రామంలో ఇటీవల విష జ్వరాలు ప్రబలుతుండడంతో మంగళవారం పీహెచ్‌సీ సూపర్‌వైజర్ చంద్రకళ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. వేడి చేసి చల్లార్చిన నీరు తాగాలన్నారు. వేడి ఆహారం తీసుకోవాలని అలాగే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తీవ్రమైన జ్వరం తలనొప్పి దగ్గు వంటి లక్షణాలు ఉంటే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవాలని చెప్పారు. ల్యాబ్ టెక్నీషియన్ పురుషోత్తం ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

మహిళా రైతులు నిర్ణయాధికారులుగా ఎదగాలి



వెల్దుర్తి ఆర్బీకేలో మహిళా రైతులను సన్మానిస్తున్న డీఏఓ పీఎల్ వరలక్ష్మి, ఆత్మ జిల్లా డీపీడీ శ్రీలత

వెల్దుర్తి: మహిళలు లేని వ్యవసాయం, అనుబంధ రంగాలను ఊహించలేమని, మహిళా రైతులు పురుషులతో సమానంగా నిర్ణయాధికారులుగా ఎదగాలని జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) పీఎల్ వరలక్ష్మి అన్నారు. మంగళవారం 'మహిళా కిసాన్ దివస్' పురస్కరించుకుని వెల్దుర్తి ఆర్బీకే–1లో ఆత్మ సంస్థ ఆధ్వర్యంలో మహిళా రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో డీఏఓ, ఆత్మ జిల్లా డీపీడీ శ్రీలతతో కలిసి పాల్గొన్నారు. మహిళా రైతులు, కూలీలకు వివిధ పంటలపై తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను, యాజమాన్య పద్ధతులను వివరించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్బీకేలను, మహిళలకందిస్తున్న తోడ్పాటును ఉపయోగించుకోవాలన్నారు. వ్యవసాయంలో రాణిస్తున్న మండల కేంద్రంలోని మహిళా రైతులు మల్లీశ్వరి, హుస్సేన్‌బీ తదితరులను సన్మానించారు. అంతకుముందు ఆమె రామళ్లకోట గ్రామంలో నూతన వేరుశనగ వంగడాలతో సాగుచేసిన పొలాన్ని పరిశీలించారు. డీఆర్సీ ఏడీఏలు వెంకటేశ్వర్లు, గిరీష్, స్థానిక, ఆత్మ, డీఆర్సీ ఏఓలు అక్బర్‌బాష, మధుమతి, శశిధర్‌రెడ్డి, వెలుగు సీసీ ఫాతిమా, ఆర్బీకే సిబ్బంది, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

సురక్షతో ప్రజారోగ్యానికి భద్రత



మద్దికెరలో వైద్యపరీక్షల కోసం వచ్చిన ప్రజలు



గుమ్మనూరులో కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

మద్దికెర: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకంతో ప్రజల ఆరోగ్యానికి భద్రత ఏర్పడుతుందని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ అనిత, సర్పంచ్ సుహాసిని అన్నారు. మంగళవారం మద్దికెర సచివాలయం–2 పరిధిలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యపరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా మందుల పంపిణీ చేశారు. ఎంపీడీఓ నరసింహమూర్తి, తహసీల్దార్ నాగభూషణం, వైద్యాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

చిప్పగిరి: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం గ్రామాల్లోనే అందిస్తున్నట్లు ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ అన్నారు. మంగళవారం గుమ్మనూరు గ్రామంలో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఒక్క రోజులోనే 512 మందికి స్పెషలిస్ట్ డాక్టర్లు ఆరోగ్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

ఆస్పరి: మండలంలోని కైరుప్పల గ్రామంలో సురక్ష వైద్య శిబిరంలో దాదాపు 400 మందికి వైద్య సేవలదించినట్లు డాక్టర్ రఘురామిరెడ్డి తెలిపారు. డాక్టర్ దుర్గాబాయి, గీతావాణి, శశికిరణ్, మంజుల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ తిమ్మక్క, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండల పరిధిలోని నెరుడుప్పల గ్రామంలో సురక్ష కార్యక్రమంలో 257 మందికి డాక్టర్లు వైద్య పరీక్షలు చేశారు. వైద్య శిబిరాన్ని ఈఓఆర్డీ నాగేష్ పర్యవేక్షించారు. డాక్టర్లు రంగరవళి, రుక్సానా, సింధూర, దివ్యశ్రీ ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

నందవరం: మండల పరిధిలోని ఇబ్రహీంపురం గ్రామ సచివాలయంలో సర్పంచ్ నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. స్పెషలిస్ట్ డాక్టర్లు ఓపీ ద్వారా 501 మందికి వైద్య సేవలందించారు. 64 మందికి కంటి పరీక్షలు చేశారు. అలాగే మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరాన్ని ఎంపీడీఓ దశరథ రామయ్య పర్యవేక్షించారు.

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామం సచివాలయం–2లో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి అపరేషన్లకు సిఫార్సు చేశారు.

వెల్దుర్తి: మండలంలోని రత్నపల్లె గ్రామంలో నిర్వహించిన సురక్ష హెల్త్ క్యాంప్‌లో 505 మంది ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నట్లు గ్రామ వీహెచ్‌సీ జాన్ తెలిపారు. వైద్యాధికారులు భువనతేజ, శ్రీధర్ రెడ్డి, భరత్, అమర్‌నాథ్‌రెడ్డి, కవిత వైద్య చికిత్సలు చేసి మందులు పంపిణీ చేశారు.

హాలహర్వి: ప్రతిఒక్కరూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ఎంపీపీ నగేష్, ఎంపీడీఓ ఆంతోనీ, తహసీల్దార్ మల్లికార్జునస్వామి సూచించారు. ఈ మేరకు మంగళవారం కొక్కరచేడు గ్రామంలో సర్పంచ్ మన్మథరెడ్డి, మల్లికార్జునపల్లి సర్పంచ్ లక్ష్మి సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. సీనియర్ వైద్యులు గంగాధర్, తిమ్మన్న రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

దేవనకొండ: మండలంలోని కరివేముల గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో దాదాపు 500 మంది చికిత్స చేయించుకున్నట్లు వైద్యులు విజయభాస్కర్ చెప్పారు. దీర్ఘకాల వ్యాధిగ్రస్తుల గురించి ఆరా తీసి, వారికి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందేలా చూస్తామన్నారు. మలేరియా సబ్ యూని అధికారి సాయిబాబా, సర్పంచ్ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పత్తికొండటౌన్: పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా ఇస్తోందని ఎంపీపీ ఎం.నారాయణదాసు అన్నారు. మంగళవారం పత్తికొండలోని సచివాలయం–3 ఆవరణలో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు, ఆరోగ్యసిబ్బంది పజలకు వివిధ పరీక్షలు చేసి మందులను అందజేశారు.



గుడేకల్‌లో వైద్య సేవలందిస్తున్న సిబ్బంది



రత్నపల్లె హెల్త్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తుగ్గలి: చెన్నంపల్లిలో నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని ఎంపీటీసీ సభ్యురాలు లలితమ్మ ప్రారంభించారు. వైద్య శిబిరాలతో పేదలకు ఖర్చు లేకుండా ప్రభుత్వం నాణ్యమైన వైద్యం, ఉచితంగా మందులు పంపిణీ చేస్తోందన్నారు. డాక్టర్లు ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

కృష్ణగిరి: మండల పరిధిలోని కోయిలకొండ గ్రామంలో సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, ఎంపీడీఓ విశ్వమోహన్‌తో కలిసి ప్రారంభించారు. గ్రామంలోని 456 మందికి స్పైషలిస్ట్ డాక్టర్లచే వైద్య సేవలు అందించినట్లు వైద్యాధికారి ప్రదీప్ తెలిపారు. ఎంఈఓ మద్దయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.